ప్రజాశక్తి
శనివారం 29 నవంబర్ 2025
5
పార్వతీపురం మన్యం

మాక్ అసెంబ్లీలో నిహారిక ప్రతిభ అమోఘం

పాలకొండ : భారత రాజ్యాంగ దినోత్సవం- 2025 పురస్కరించు కొని గత బుధవారం రాష్ట్ర అసెంబ్లీలో జరిగిన మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో ప్రతిపక్షనేతగా వ్యవహరించిన మండలంలోని ఎం.సింగిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి మల్లివీడుకు చెందిన గంధవరపు నిహారిక కబర్చిన ప్రతిభ అమోఘమని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కొనియాడారు. నిహారికలో గల ప్రతిభను వెలికితీసి, వారి నైపుణ్యాలను పదును పెట్టి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ఈ సందర్భంలో ఎమ్మెల్యే అభినందించారు. ఆడపిల్ల అని బిడియపడకుండా అసెంబ్లీ చర్చా వేదికలో ధైర్యంగా పాల్గొన్న నిహారికను కొనియాడారు.

అలరించిన సాహిత్య కార్యక్రమాలు

వెయ్యి మంది విద్యార్థులతో పాడుదమా స్వేచ్ఛాగీతం ఆలాపన

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురంలో నాలుగు రోజులుగా జరుగుతున్న పుస్తక మహోత్సవం పుస్తక ప్రియులను అలరిస్తోంది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. పుస్తక మహోత్సవంలో భాగంగా ప్రభుత్వ కళాశాల మైదానంలో శుక్రవారం ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు మాస్టారు రచించిన 'పాడుదమా స్వేచ్ఛా గీతాన్ని' శుక్రవారం వేలాదిమంది విద్యార్థులు ఒకేసారి గీతాలాపన చేశారు. విద్యార్థులంతా ఉత్సాహభరితంగా గానమృతంగా ఈ గీతాన్ని మరోసారి వెలుగెత్తి చాటారు. పుస్తక మహోత్సవ కమిటీ సభ్యులు ఎస్.మురళీమోహన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ దేశానికి పట్టిన దెయ్యం లాంటి దరిద్ర్యాన్ని వదిలి పెట్టేందుకు ఈ పాట అంకితం కావాలని ఆశించానని అన్నారు. దేశాన్ని ప్రతి పౌరుడు ప్రేమిస్తాడని, కానీ దానిని హృదయాల్లో దాచుకున్న కొందరిలో మాత్రమే దీక్ష భక్తి నిలిచి ఉంటుందని అన్నారు. దేశభక్తి అంటే జెండాలో ఉన్న మూడు రంగులు మాత్రమే కాదని మూడు మతాల కలయికని, ఆ ఐక్యతతోటే దేశం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. యుటిఎఫ్ నాయకులు కె.విజయగౌరి మాట్లాడుతూ ప్రజలందరూ ఈ గానాన్ని మరింత ముందు తరాలకు స్ఫూర్తిదాయకంగా అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా డివిఇఒ కె.నాగేశ్వరరావుతో పాటు పలు కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నక్షత్ర బాట పుస్తక పరిచయం

అనంతరం గంటేడ గౌరునాయుడు అధ్యక్షతన సాహిత్య, సాంస్కృతిక వేదిక ప్రారంభమైంది. ప్రముఖ నవలా రచయిత అట్టాడ అప్పలనాయుడు రచించిన నక్షత్రబాట పుస్తక పరిచయాన్ని చందక గాయత్రీరావు చేశారు. పార్వతీపురం కేంద్రంగా ఈ పుస్తకం పరిచయం చేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. పుస్తకంలో చదివిన ప్రతీ అక్షరం శ్రీకాకుళం రైతాంగ పోరాటంలో తెలియాడినట్టు ఉంటుందని తెలిపారు. తప్పకుండా సామాజిక చైతన్యాన్ని పెంపొందించే నవలని పేర్కొన్నారు.అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ కళింగాంధ్ర కథకు గురజాడ అప్పారావు గొప్ప బీజం వేశారని అన్నారు. ఆయన దిద్దుబాటు కథ రాయకపోతే కళింగాంధ్ర కథ తెలుగు సాహిత్యంలో జెండా ఎగుర వేసి ఉండేది కాదని అన్నారు. కళింగాంధ్ర కథ సమాజం వెంట, సమాజకోసం నడిచిందన్నారు. గురజాడ అప్పారావు సౌధామని అనే నవల రాద్దామని అనుకున్నారని, సమాచారం కూడా సిద్ధం చేసి ఉంచారని, ఆ నవల రాసి ఉంటే కళిగాంధ్ర నవల మరింత ఉన్నత స్థితిలో ఉండేదని చెప్పారు. నవలా రచయితలు రోజురోజుకూ తగ్గిపోతున్న తరుణంలో పలువురు యువతరం నవలా రచయితలు ఉమ్మడి విజయనగరం జిల్లాలో ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఆధునికత, వేగవంతం, సంక్షోభం, ఆయోమయం, అనిశ్చితి, ఆధునికత ఉండడంవల్లే నవల రాసే వాతావరణం వస్తోందని అన్నారు. కార్యక్రమంలో పక్కి రవీంద్ర, సిరికి స్వామినాయుడు, కె.భాస్కరరావు మరియు తదితర సాహితీ వేతలు పాల్గొన్నారు.

నక్షత్ర బాట పుస్తక పరిచయం

నక్షత్రబాట పుస్తక పరిచయ కార్యక్రమంలో మాట్లాడుతున్న రచయిత అప్పలనాయుడు

పాడుదమా స్వేచ్ఛా గీతం ఆలాపన కార్యక్రమంలో పాల్గొన్న సాహితీ ప్రియులు, కవులు, ఉపాధ్యాయులు

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు రావాలి

విద్యాశాఖ కమిషనర్ ఎస్.విజయరామరాజు

ప్రజాశక్తి - పాలకొండ

పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణశాతం పెరగడమే కాదని విద్యార్థులకు అత్యధిక మార్కులు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఎస్.విజయరామరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చక్కటి మార్కులు వచ్చేలా చూడాలన్నారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి ప్రతిభకు సంబంధించి డైరీ ఏర్పాటు చేసి ఏ సబ్జెక్టుల వెనుకబాటు ఉందో గుర్తించాలన్నారు ప్రతి విద్యార్థి పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. టెన్త్ విద్యార్థుల విద్యా బోధనపై క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఆయన వెంట కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ తదితరులు ఉన్నారు.

భామిని : స్థానిక ఆదర్శ పాఠశాలను రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్.విజయరామరాజు శుక్రవారం పరిశీలించారు. ఆదర్శ పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, ఆర్‌ఒ ప్లాంట్, తరగతి గదులు నిర్వహణ, స్పోర్ట్స్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్‌లను, అకాడమిక్ అంశాలు పరిశీలించారు. ఇంటర్ విద్యార్థులతో మాట్లాడుతూ, తాము సిలబస్ కవరేజ్‌పై ప్రవేశపెట్టిన 100 ప్లాన్ ఇంప్లిమెంట్ అంశాలు అడిగారు. టెన్త్‌లో హిందీలో తీసుకువచ్చిన మార్పు నచ్చిందా అని అడిగారు. ప్రతి రోజు ఉదయం నిర్వహించే ప్రార్థనలో హిందీ మాట్లాడేలా ఒక కార్యక్రమం చేపట్టండని సూచించారు. అనంతరం భామిని ప్రాథమిక మోడల్ స్కూల్‌ను పరిశీలించారు. ఈయన వెంట జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి, పాలకొండ సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథం, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బాబురావు, వైస్ ప్రిన్సిపాల్ వసుధ, స్కూల్ కమిటీ చైర్మన్ వానపల్లి రవి, తహశీల్దార్ శివ్వన్నారాయణ, ఎంపిడిఒ వసంత కుమారి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

భామిని మోడల్ స్కూల్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్

సీతంపేట : స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను విద్యాశాఖ రాష్ట్ర కమిషనర్ విజయరామరాజు, కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యం పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని అన్నారు. పదో తరగతిలో ఈ ఏడాది అంతా ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సామర్థ్యం తెలుసుకున్నారు. సిలబస్ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందని దీన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఆయనతో పాటు పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, ఎపిఒ చినబాబు, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్‌రావు, ఎంఇఒ ఆనందరావు, ప్రధానోపాధ్యాయులు చంద్రరావు, వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యుఒ అమల తదితరులు పాల్గొన్నారు.

విద్యా శాఖ కమిషనర్‌కు ఘన స్వాగతం

రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

పాలకొండ : రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్.విజయరామరాజుకు పాలకొండలో ఘన స్వాగతం లభించింది. అధికారిక పర్యటన నిమిత్తం జిల్లాలోని పాలకొండ రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి, పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ పుష్పగుచ్ఛాలు అందజేసి సాదర స్వాగతం పలికారు. జిల్లాలో విద్యా వ్యవస్థ అమలుతీరు, విద్యా శాఖకు సంబంధించిన ప్రభుత్వ పథకాల పురోగతిని సమీక్షించడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, బోధనా పద్ధతులు, విద్యా ప్రమాణాల మెరుగుదల వంటి కీలక అంశాలపై కమిషనర్ జిల్లా, డివిజన్ స్థాయి అధికారులతో సమీక్షలు నిర్వహించనున్నారు. ప్రోటోకాల్‌లో భాగంగా కలెక్టర్, సబ్ కలెక్టర్ అధికారితో కలిసి కమిషనర్‌ను ఆహ్వానించారు.

జెసికి వినతిని అందజస్తున్న ప్రజాసంఘాల నాయకులు

హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలి

జాయింట్ కలెక్టర్‌కు ప్రజా సంఘాలు వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం

మక్కువ మండలం దుగ్గేరు వద్ద ఏర్పాటు చేయనున్న హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం, తదితర సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు కొల్లి గంగునాయుడు, కె.రామస్వామి, ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ గిరిజన హక్కుల రక్షణ చట్టమైన పీసా చట్టానికి విరుద్ధంగా అనుమతులు పొందిన చింత ఎనర్జీస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణం తలపెట్టిన హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పవర్ ప్రాజెక్టు వల్ల గిరిజనుల ఉపాధి పూర్తిగా దెబ్బతింటుందని, ఇప్పటికే గిరిజనులు పోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారని వారి జీవనాన్ని హరించే హక్కు ఎవరికీ లేదని తెలిపారు. ఈ పవర్ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు చట్ట విరుద్ధంగా చేయబడ్డాయని ఇప్పటికే తోటపల్లి, వెంగళరాయ సాగర్ ఆయకట్టు రైతులకు సరిపడా సాగు నీరు సరఫరా కావడంలేదని, ఈ నేపథ్యంలో ఈ పవర్ ప్రాజెక్టుకు సుమారు ఒక టిఎంసి నీటిని ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు? కార్పొరేట్లకు ప్రజా సంపదను దోచిపెట్టే ప్రయత్నమే ఇది తప్ప, ప్రజలకు ఈ ప్రాజెక్టు వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని తెలిపారు. అందువల్ల దుగ్గేరు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా గిరిజనులను, రైతులను ఐక్యం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు మండంగి శ్రీనివాసరావు, ఎం.అడ్డమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంత నర్సిపురంలో వైద్య శిబిరం

వీరఘట్టం : మండలం సంత నర్సిపురంలో శుక్రవారం స్థానిక వైద్యాధికారి ఎం.సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, మధుమేహ, రక్తపోటు, చిన్నారులు తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకే ఎఫ్ఎల్ఎన్ పరీక్షలు

- 6 నుంచి టెన్త్ విద్యార్థులకు వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక
- 5న రాష్ట్ర వ్యాప్తంగా మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్
- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - పాలకొండ

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఎఫ్ఎల్ఎన్ (ఫండమెంటల్ లిటరసీ అండ్ నూమరసీ) కార్యక్రమాన్ని ప్రారంభించిందని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం భామిని ఎపి మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీ, ప్రైమరీ స్కూలును, సీతంపేటలోని బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహం, పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ చేపట్టిన పలు కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 3, 4,5 తరగతి విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమైందన్నారు. విద్యాశాఖ రూపొందించిన ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారని, ఈ పరీక్షలను ఉపాధ్యాయులు కాకుండా, డైట్ విద్యార్థులు, సిఆర్‌పిలు నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులకు అక్షరాలు, పదాలు, అంకెలు చూపించి వారి సామర్థ్యాన్ని గుర్తిస్తారని, దీని ద్వారా విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నారో తెలుసుకుని, వారు వెనుకబడి ఉంటే తగిన ప్రణాళికలతో వారి ప్రమాణాలను పెంచడానికి కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ ఎఫ్ఎల్ఎన్ పరీక్షల నిర్వహణపై జిల్లాలో పలు పాఠశాలలను సందర్శించామని, జిల్లాలో చురుగ్గా ఈ కార్యక్రమం జరుగుతుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారన్నారు. త్వరలో అన్ని పాఠశాలల్లో పూర్తయిన పిదప సత్ఫలితాలు ఉంటాయాని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే సిలబస్ పూర్తి కావాల్సి ఉందని, దీనిపై పాఠశాలల్లో తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 6నుంచి టెన్త్ విద్యార్థులకు ప్రత్యేకంగా వంద రోజుల ప్రణాళిక అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

5న మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్

డిసెంబర్ 5న రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో "మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్" జరగనుందని తెలిపారు. కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించి, పలు సూచనలు, మార్గదర్శకాలు జారీచేసినట్లు చెప్పారు. ఈ సమావేశానికి తల్లిదండ్రులందరూ తప్పకుండా హాజరు కావాలని కలెక్టర్ కోరారు. ప్రజాప్రతినిధులు కూడా ఈ సమావేశాలను పర్యవేక్షించాలని సూచించారు.

'ముస్తాబు'తో మెరుగైన ఆరోగ్యం

జిల్లాలో అమలు చేస్తున్న "ముస్తాబు" (శుభ్రత/పరిశుభ్రత) కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోందని కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు. పిల్లలు శుభ్రంగా చేతులు కడుక్కుని తరగతి గదిలోకి రావడం, భోజనం చేయడం వంటి అలవాట్ల వల్ల గత నెల రోజులుగా విద్యార్థుల్లో అనారోగ్య సమస్యలు భారీగా తగ్గాయని తెలిపారు. పాఠశాలల తనిఖీ సమయంలో గత 10-15 రోజుల్లో ఎవరూ సిక్ కాలేదని రిపోర్ట్స్ వస్తున్నాయని, కేవలం సాధారణ జ్వరాలు తప్ప పెద్ద ఆరోగ్య సమస్యలు జిల్లాలో నమోదు కాలేదని వివరించారు. ఈ పర్యటనలో డిఇఒ బి.రాజ్‌కుమార్, ఎస్ఎస్ఎ ఎపిసి ఆర్.తేజేశ్వరరావు, ఎంఇఒలు పాల్గొన్నారు.

పాగాకు రహిత సమాజ నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పొగాకు ఉత్పత్తుల వాడకంతో ఆరోగ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, పొగాకు రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు పేర్కొన్నారు. టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్‌లో భాగంగా ఎంఆర్ నగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వైద్య బృందంతో కలిసి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు ఉత్పత్తుల వాడకంతో ప్రజారోగ్యం, జీవన ప్రమాణాలు తద్వారా సమాజాన్ని ప్రభావితం చేస్తాయని, వీటిని నియంత్రించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. పాఠశాలలు, కాలేజీల ఆవరణలో వంద గజాల పరిధిలోపు పొగాకు ఉత్పత్తుల అమ్మకం నిషిద్ధమని తెలిపి సంబంధిత కోప్టా చట్టాలపై అవగాహన కల్పించారు. పొగాకు ఉత్పత్తుల వాడకంతో శరీరంలో ముఖ్యమైన అవయవాలు ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, గుండె, మెదడు, ప్రత్యుత్పత్తి వ్యవస్థపై ప్రభావం ఉంటుందని అన్నారు. కేన్సర్ కలుగజేసే ప్రధాన కారకాల్లో పొగాకు ముఖ్యమని తెలిపారు. సీజనల్ వ్యాధులు, మెరుగైన ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు.

విద్యార్థులచే ప్రతిజ్ఞ చేస్తున్న డిఐఒజగన్మోహనరావు

అనంతరం విద్యార్థులచే పొగాకు వ్యతిరేక సంతకాల సేకరణ చేయించి తదుపరి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ ఎ.విలియం క్వారీ, సూపర్వైజర్ జయగౌడ్, ఎన్టిసిపి సోషల్ వర్కర్ భవాని, మెంటల్ హెల్త్ ప్రోగ్రాం సిబ్బంది కృష్ణారావు, వైద్య సిబ్బంది నందిని, దమయంతి, ఉపాధ్యాయ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి

పూలే స్ఫూర్తితో మహిళా సమస్యలపై పోరాటం : ఐద్వా

ప్రజాశక్తి - పార్వతీపురం

బాపూజీ జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో మహిళలు, అణగారిన వర్గాల సమస్యలపై పోరాటాలకు సిద్ధపడాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బి.లక్ష్మి పిలుపునిచ్చారు. జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ఐద్వా కార్యాలయంలో పూలే వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు విద్యా హక్కు సాధనకు, బాల్య వివాహాల నిర్మూలనకు జ్యోతిరావు, సావిత్రీబాయి పూలే విశేషమైన కషి చేశారని చెప్పారు. 18వ శతాబ్దంలోనే జ్యోతిరావు పూలే దేశంలో దళిత, అణగారిన వర్గాల హక్కులు, మహిళల అభ్యున్నతికి కోసం విశేషమైన కృషి చేశారని కొనియాడారు. వారి పోరాట స్ఫూర్తితోనే భారతదేశంలో బ్రిటీష్ కాలం నుంచి మహిళలకు విద్యా, ఓటు హక్కు వంటివి సాధించబడ్డాయని, కుల వివక్ష, అంటరానితనం నిర్మూలనకు అనేక చట్టాలు రూపొందించ బడ్డాయని తెలిపారు జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా నివాళు లర్పించారు. పూలే దంపతుల స్ఫూర్తితో భవిష్యత్ ప్రజా ఉద్యమాలకు సన్నద్ధం కావాలని మహిళలకు, అణగారిన వర్గాలకు ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎం.గౌరమ్మ, ఆదిలక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పిఎపై కేసు నమోదు

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి పిఎ సతీష్‌పై స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గురువారం సాయంత్రం మహిళా సంఘాలతో కలిసి ఒంటరి మహిళా ఉద్యోగి ఎఎస్‌పి వెంకటేశ్వరరావు కి ఫిర్యాదు చేశారు. పిఎ సతీష్ తన వద్ద కారుణ్య నియామకంలో భాగంగా ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.5లక్షలు తీసుకున్నారని, లైంగికంగా వేధించారని ఆమె పిర్యాదు చేశారు. అంతే కాకుండా మంత్రి కుమారుడు కూడా వాట్సాప్ మెసేజ్ ద్వారా వేధించారని ఆమె ఆరోపించారు. అయితే పోలీసులు పిఎ సతీష్ పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా పిఎ సతీష్ శుక్రవారం తన పోస్ట్‌కు రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను మంత్రి సంధ్యారాణికి పంపించారు. అదే విధంగా టిడిపి నాయకులతో కలిసి సతీష్ కూడా ఒకటీవీ చానెల్, పత్రికలపై పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ.75లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా పోలీసుశాఖలో కానిస్టేబులుగా పని చేస్తూ, ప్రమాదవశాత్తు జరిగిన రైలు ప్రమాదంలో మరణించిన గవర మల్లేశ్వరరావు కుటుంబానికి ఎస్‌బిఐ పోలీసు సేలరీ ప్యాకేజ్ ప్రయోజనంగా మంజూరైన రూ.75 లక్షల చెక్‌ను ఆయన భార్య డొల్లు శ్రావణికి బ్యాంకు అధికారుల సమక్షంలో శుక్రవారం ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అందరికీ స్టేట్ బ్యాంకు పోలీసు సేలరీ ప్యాకేజ్‌ను ఇప్పటికే ప్రారంభించామన్నారు. ఈ ప్యాకేజ్ ప్రయోజనంలో భాగంగా ఎవరైనా పోలీసు ఉద్యోగి విధి నిర్వహణలో భాగంగా ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి ప్రస్తుతం రూ.1కోటి, సాధారణ మరణం సంభవిస్తే రూ.10 లక్షలు ఆర్థిక సహాయం ఎస్‌బిఐ అందించనుందన్నారు. ఇందులో భాగంగా స్థానిక పోలీసు స్టేషనులో కానిస్టేబుల్‌గా గవర మల్లేశ్వరరావు పని చేస్తూ విధి నిర్వహణలో భాగంగా ఓపెన్ డ్రింకింగ్, గంజాయి సేవించే వారిని పట్టుకొనే క్రమంలో స్థానిక పట్టణ రైల్వే స్టేషన్ వైపు వెళ్తుండగా, ప్రమాదవశాత్తు రైలు ప్రమాదానికి గురై అక్టోబర్ 11న మరణించారు. దీంతో ఎస్‌బిఐ అధికారులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపగా మరణించిన మల్లేశ్వరరావు భార్య డొల్లు శ్రావణికు అప్పటిలో పోలీస్ శాలరీ ప్యాకేజీ ప్రకారం ప్రయోజనంగా రూ.75 లక్షలు మంజూరు చేశారన్నారు. ఎస్‌బిఐ ద్వారా వచ్చిన డబ్బును వృథా చేయవద్దని, ఇద్దరి కుమారుల భవిష్యత్తుకు బాటలు వేయాలని, మంచిగా చదివించి, ప్రయోజకు చేయాలని, కొంత మొత్తాన్ని వారి పేరు మీదుగా ఫిక్స్ డిపాజిట్ చేసుకోవాలని శ్రావణికి ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఆర్ఐలు నాయుడు, రాంబాబు, ఎస్పీ ఎక్స్ సిఐ రమేష్, ఎస్బిఐ రీజనల్ మేనేజరు(బొబ్బిలి) బిభూతి భూషణ్ సాహు, చీఫ్ మేనజర్ పార్వతీపురం, రాజన్ దత్త, చీఫ్ మేనజర్ బొబ్బిలి, విజయ కుమార్, బ్రాంచ్ మేనజర్ కురుపాం, శ్రీనివాస రావు , ఎస్బిఐ రీజనల్ ఇన్సూరెన్స్ ఆఫీసర్ షరీఫ్, కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



మృతుడు కానిస్టేబుల్ కుటుంబానికి చెక్‌ను అందజేస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

పిజిఆర్ఎస్ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కారం చేయాలని, జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యాలయాల చుట్టూ అర్జీదారులను తిప్పవద్దన్నారు. కార్యాలయం పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు కూడా నాటాలని సూచించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ ఎఎస్ కామేశ్వరరావు, ఉప తహసిల్దారు, ఆర్ఐ, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపల్ సాధారణ సమావేశం ఈనెల 29న జరగనుందని కమిషనర్ టిటి రత్న కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మందిరంలో జరగనున్న ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, కౌన్సిలర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

లక్షలు వ్యయం.. ఫలితం శూన్యం

వృథాగా పడి ఉన్న మరుగుదొడ్లు

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యార్థుల సౌకర్యార్థం గత టిడిపి హయాంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)పాఠశాలల ఆవరణలో లక్షలాది రూపాయలు వెచ్చించి మరుగుదొడ్లు నిర్మాణ పనులు చేపట్టారు. చేసిన పనులకు తగ్గ బిల్లుల చెల్లింపులో అధికారులు నిర్లక్ష్యం చూపడంతో గుత్తేదారులు అర్థాంతరంగా పనులు నిలిపివేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటిపై దృష్టి సారించకపోవడంతో మనబడి నాడు- నేడు కింద పాఠశాలల అభివృద్ధితో పాటు కొత్తగా మరుగుదొడ్లు నిర్మించడంతో గతంలో నిర్మించిన మరుగుదొడ్లు మూలనపడి మూలుగుతున్నాయి. ప్రస్తుతం ఈ మరుగుదొడ్ల నిర్మాణాలకు పిల్లర్లు వేసి పైన శ్లాబ్ వేసి అర్థాంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుతం ఇవి ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీరి నిర్మాణాలు పూర్తి చేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

బాలికల ఉన్నత పాఠశాలలో అర్థాంతరంగా నిలిచిపోయిన మరుగుదొడ్లు

ఫిర్యాదులను పరిశీలిస్తున్న జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్ల గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి పలువురు ఉద్యోగుల, పెన్షనర్ల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించారు. ఉద్యోగులు విన్నవించిన వివిధ సమస్యలపై ఆయన ఓపిగ్గా ఆలకించి పరిష్కారాలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో 36 దరఖాస్తులు రాగా, వాటిని సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని వాటిని సకాలంలో పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ కె.హేమలత, జిల్లా ఖజానా అధికారి ఆర్‌ఎస్ కుమార్, కలెక్టరేట్ ఎఒ విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

30న నవోదయ మెగా మోడల్ టెస్ట్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక శ్రీగాయత్రీ స్కూల్, కళాశాలలో ఈనెల 30న జవహర్ నవోదయ మెగా మోడల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా మోడల్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే మొదటి పది ర్యాంకులకు షీల్డ్ ప్రదానం చేయబడుతుందని, టెస్ట్‌కు వచ్చిన విద్యార్థులకు మాత్రమే భోజన సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. టెస్ట్‌కు హాజరైన వారు రూ.100 ప్రవేశ ఫీజు చెల్లించాలన్నారు. టెస్టు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఉంటుందన్నారు. కేవలం 5వ తరగతి చదివిన విద్యార్థులు మాత్రమే ఈ టెస్ట్‌కు హాజరుకావాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9010886604, 9346028387 నెంబర్లకు సంప్రదించాలని వారు కోరారు.

మండల బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బి.రవణమ్మ అధ్యక్షతన 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ 2025-26 సంవత్సరం సవరించిన అంచనా బడ్జెట్ రూ.9కోట్ల 67 లక్షల 6,545 గాను 2026 -27 సంవత్సర బడ్జెట్ అంచనా రూ.10 కోట్ల 9,38,692 అంచనా వేయడం జరిగిందన్నారు. వివిధ అంశాలు మహిళా, శిశు సంక్షేమం, నీటి సరఫరా, పారిశుధ్యం, హౌసింగ్, విద్య, పెన్షన్ పంపిణీ ఉంటే ఆ అంశాలను పొందుపర్చి వాటికి అయ్యే ఖర్చులు ఆదాయ వనరులు పట్టి అంచనా వేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ బడ్జెట్‌ను ఎంపిటిసి సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, పలువురు ఎంపిటిసి సభ్యులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని మహిళా టీచర్లకు జోగుంపేట కెజిబివి పాఠశాల వద్ద వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒలు ఎం.వెంకటరమణ, జి.సూర్యదేముడు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే పురుష ఉపాధ్యాయులకు బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ పోటీలు ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నట్లు తెలిపారు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడమే తన ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు వినతుల రూపంలో అందించిన సమస్యలను పరిశీలించి వాటిలో తక్షణమే పరిష్కరించదగినవని అక్కడికక్కడే పరిష్కార మార్గాన్ని చూపారు. మరికొన్ని సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పూర్తి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి సమస్య తక్షణ పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఇప్పటికే పింఛన్లు, ఇళ్లు, రోడ్లు, భూ, విద్యుత్, తదితర సమస్యలను పరిష్కరించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ ప్రజా దర్బార్ నిర్వహించడం జరుగుతుందని, దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేత్ర శస్త్రచికిత్సలకు వృద్ధుల తరలింపు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల సచివాలయాల పరిధిలో ఐటిడిఎ నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో కేటరాక్ట్(అంధత్వ కుసుమం) బిజెయిం (కొయ్యకంటి) లోపం ఉన్న వారిని గుర్తించి శుక్రవారం కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి 40 మందిని పుష్పగిరి ఆసుపత్రికి శస్త్ర చికిత్సలు తరలిస్తున్నట్లు మన్యం జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జిరు నగేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శస్త్ర చికిత్సలు వెళ్ళిన వారందరికీ ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్లజోళ్లు, మందులు సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర రజని, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం కొత్త బ్రిడ్జిని పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం

మండల కేంద్రంలో కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు ఎంతవరకు జరిగాయి, ఎప్పుడు పూర్తవుతాయని సంబంధిత ఆర్‌అండ్‌బి ఇంజినీర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణ పనులు అతివేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. పాత బ్రిడ్జి పాడవ్వడంతో రాకపోకలకు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు ఆర్ అండ్ బి అధికారులు ఉన్నారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి - వీరఘట్టం

అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని సాలూరు ఎడిఎ జె.సత్యవతి ఎరువుల దుకాణ డీలర్లను హెచ్చరించారు. వీరఘట్టంలోని స్థానిక భోగి ఉమామహేశ్వర అండ్ సన్స్, మన గ్రోమోర్ సెంటర్, శ్రీ సత్యనారాయణ ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. నోటీస్ బోర్డుపై స్టాకు వివరాలు ఎంఆర్‌పి ధరలు తప్పనిసరిగా ప్రతిరోజు రాయాలన్నారు. ఎరువులకు సంబంధించి స్టాక్ రిజిస్టర్లు కూడా సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎడిఎతో పాటు స్థానిక వ్యవసాయ అధికారి సౌజన్య ఉన్నారు.

సంస్థాగతంగా బలోపేతానికి చర్యలు

కాంగ్రెస్ సమావేశంలో ఎఐసిసి పరిశీలకులు దేబాసీష్ పట్నాయక్

ప్రజాశక్తి - సాలూరు

కాంగ్రెస్‌ను సంస్థాగత నిర్మాణం పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎఐసిసి పరిశీలకులు, ఒడిషాలోని బంకి నియోజకవర్గ ఎమ్మెల్యే దేబాసీష్ పట్నాయక్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సీతారామ కళ్యాణ మండపంలో నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రామకృష్ణ ఆధ్వర్యాన పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులతో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దేబాసీస్ పట్నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఎంతో ఘనచరిత్ర ఉందన్నారు. క్రమశిక్షణ కలిగిన జాతీయ పార్టీగా దేశ ప్రజలకు విశేష సేవలను, అనేక సంక్షేమ ఫలాలను పేదలకు అందించిన ఘనతకు ఉందన్నారు. రాజ్యాంగబద్ధమైన పరిపాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యపడుతుందన్నారు. పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై అధిష్టానం దృష్టి సారించిందన్నారు. బూత్, గ్రామ, మండల స్థాయి కమిటీల నియామకం చేపట్టామన్నారు. కీలకమైన డిసిసి అధ్యక్షుల నియామకం అత్యంత పారదర్శకంగా జరుగుతుందన్నారు. అందులో భాగంగా జిల్లాల్లో, నియోజకవర్గ కేంద్రాల్లో పర్యటించి కార్యకర్తల మనోభావాలను, స్థానిక సమస్యలను తెలుసుకొని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్ళిన తర్వాతే డిసిసి అధ్యక్షులు నియామకం చేపడతామన్నారు. వచ్చే ఎన్నికల నాటికి పార్టీకి పూర్వ వైభవం వచ్చేలా ప్రతి కార్యకర్త కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్వతీపురం మన్యం జిల్లా డిసిసి అధ్యక్షులుగా తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని నియోజకవర్గం సమన్వయకర్త గేదెల రామకృష్ణ కోరారు. తన బయోడేటాను ఎఐసిసి పరిశీలకులకు అందజేశారు. కార్యక్రమంలో ఎఐసిసి సభ్యులు బుగత శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాచిపెంట శాంతకుమారి, అరుకు పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు బుల్లిబాబు, ఒబిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, నాయకులు అక్కేన అప్పారావు, రాయిపల్లి శ్రీనివాసరావు, పైడిరాజు, ఒంటి బుచ్చయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.



మన్యం జిల్లా అధ్యక్ష పదవిని కోరుతూ దరఖాస్తున్న అందజేస్తున్న రామకృష్ణ

పాలకొండ : రానున్న రోజుల్లో రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్‌దే అధికారమని ఎఐసిసి పరిశీలకులు దేబాషిస్ పట్నాయక్ అన్నారు. శుక్రవారం పాలకొండలోని ఎంఎం కన్వలెన్స్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ బలోపేతానికి సంస్థాగత నిర్మాణ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. దానిలో భాగంగా జిల్లా అధ్యక్షుడ్ని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో పార్టీ చాలా దృఢ సంకల్పంతో ఉందన్నారు. జిల్లాను ఏనుగుల సమస్య పీడిస్తోందన్నారు. ఇప్పటివరకు 12 మంది వ్యక్తులు ఏనుగుల దాడిలో మతి చెందారు.సుమారు ఆరు కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. సుమారు ఐదేళ్లుగా ఐటిడిఎ పాలకవర్గ సమావేశాలు లేకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు బిడ్డిక శ్రీనివాసరావు, పార్వతీపురం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బత్తిన మోహనరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుకాణాల ముందు చెత్త కనిపిస్తే సీజ్ : కలెక్టర్

ప్రజాశక్తి - పాలకొండ

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని, దుకాణాల ముందు చెత్త కనిపిస్తే సీజ్ చేయాలనికలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే రోడ్లపై చెత్త కనిపిస్తే ఉపేక్షించేది లేదని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు ప్రాంతాలను కలెక్టర్ సందర్శించి పరిసరాల పరిశుభ్రతను ఆకస్మిక తనిఖీ చేశారు. అందులో భాగంగా నవగాం జంక్షన్‌లోని ఓ దుకాణం వద్ద అపరిశుభ్రంగా ఉండడాన్ని కలెక్టర్ గమనించి దుకాణ యజమానిని, అధికారులను మందలించారు. అపరిశుభ్ర వాతావరణం వల్ల అనారోగ్యాలకు గురవుతారని, కావున పరిసరాలు ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. వాణిజ్య సముదాయాలు, దుకాణాల ముందు చెత్త డబ్బాలను ఏర్పాటు చేసుకొని, వాటిలో చెత్తను వేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అయినప్పటికీ ఆరుబయట చెత్తను వేస్తే జరిమానా విధించాలని అన్నారు. జిల్లాలో పరిశుభ్రత ప్రమాణాలు పాటించేలా చూడటానికి, ముఖ్యంగా వ్యాపార సముదాయాలు, వాణిజ్య ప్రాంతాల్లో ఈ కఠిన చర్యలు తప్పవని అన్నారు. చెత్త, వ్యర్థాలు లేదా నిర్మాణ శిధిలాలు కనిపిస్తే, ఎటువంటి సంకోచం లేకుండా ఆ షాపును తక్షణమే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. పరిశుభ్రత నియమాలను ఉల్లంఘించే వారి పట్ల దయ చూపడం లేదా ఉపేక్షించడం జరగదని కలెక్టర్ స్పష్టం చేశారు. చెత్త, వ్యర్థాలను బహిరంగంగా వేసే వారిపై జరిమానాలు విధించేందుకు మున్సిపల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు విస్తృత తనిఖీలు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘించిన వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యటనలో మునిసిపల్, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ఐఎఎస్ బాబూరావు

ప్రకృతి వ్యవసాయం వైపు నడవాలి

ప్రజాశక్తి - కురుపాం

గ్రామాలన్నీ పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయం వైపు నడవాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, విశ్రాంత ఐఎఎస్ అధికారి టి.బాబురావు నాయుడు పిలుపునిచ్చారు. మండలంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న కొండ బారిడి గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలు, రైతులతో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగు చేయడానికి పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ నాగరికతకు మూలం ఆదివాసులని, బహు పంటల విధానం కూడా ఇక్కడే మొదలు పెట్టారని, పూర్వపు వ్యవసాయమే ఇప్పుడు ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా వెలుగులోకి వచ్చిందని అన్నారు. రసాయన వ్యవసాయంలో వచ్చే దిగుబడికి ధీటుగా ప్రకృతి వ్యవసాయంలో దిగుబడులు పొందాలంటే పంటల వైవిధ్యంతో పాటు ఘన, ద్రవ జీవామృతం, కషాయాలు, సొంత విత్తనాలు, దేశీ విత్తనాలు వాడాలన్నారు. గిరిజన సంస్కృతి కనుమరుగైపోయిందని, మన భూమిని, ప్రకృతిని కాపాడుకోవాలంటే ప్రకృతి వ్యవసాయం చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు(డిపిఎం) ఎం.శ్రావణ్ కుమార్ నాయుడు, రైస్ సీనియర్ కన్సల్టెంట్ డి. పారినాయుడు, రైస్ ప్రాజెక్ట్ మేనేజర్ మన్మోహన్, రైతులు, మహిళా సంఘ సభ్యులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్కగూడలో రైతన్నా మీకోసం ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జగదీశ్వరి

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, అందులో భాగంగానే రైతన్న.. మీకోసం కార్యక్రమం తీసుకొచ్చిందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. మండలంలోని లక్కగూడలో రైతన్నా.. మీకోసం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి సాధించాలని, అధునాతన పద్ధతుల్లో వ్యవసాయాన్ని చేయాలన్న ఉద్దేశంతో వారికి అవగాహన కల్పించాలని ప్రభుత్వం రైతన్న మీకోసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలు ఏ పంటలను కోరుకుంటున్నారో ఆ పంటలను వేయడం ద్వారా ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందన్న విషయంపై అధికారులు అన్నదాతలకు అవగాహన కల్పించాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ధ్యేయమన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం వారు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. జీడి పంట పూత కోసం జీవామృతం, పుల్లటి మజ్జిగ పిచికారీ చేసినట్లయితే పూతదశ బాగుంటుందని, అధిక దిగుబడి వస్తుందని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి బిడ్డిక పద్మావతి, ఎఎంసి చైర్‌పర్సన్ కడ్రక కళావతి, మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్, మాజీ సమితి అధ్యక్షులు వెంపటాపు భారతి, నోంద్రుకోన సర్పంచ్ పత్తిక ముసురు, తోటపల్లి దేవస్థానం డైరెక్టర్ ఆరిక జానకి, కెవికె అధికారి ధృవ, మాజీ ఎంపిపి తాడంగి లక్ష్మణరావు, తహసీల్దార్ ఎన్ శేఖరం, మండల పశు వైద్యులు పి లక్ష్మణరావు, ప్రకతి వ్యవసాయ మండల యూనిట్ ఇన్చార్జ్ కిమిడి భూషణ్‌రావు, నాయకులు దాసు, ధర్మరావు, రామారావు, కొండలరావు, శరత్, రమేష్, నాగమణి, చిన్న, సుందర్ రావు, అప్పలస్వామి, హితీష్ కుమార్, మనోహర్, కోటి, శాంతి, లక్ష్మి, రాజేష్, కార్తికేయ, రాజు, సచివాలయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

గిరిజన సిఆర్‌టిలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఐటిడిఎ గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న సిఆర్‌టి రెన్యువల్, నియామకం, బదిలీ, సర్దుబాటు ప్రక్రియలో మొదటి ప్రాధాన్యత గిరిజన సిఆర్‌టిలకు ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఐటిడిఎ పిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఐటిడిఎలో జరుగుతున్న సిఆర్‌టి నియామకంలో గిరిజన సిఆర్‌టిలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 2016-17 విద్యా సంవత్సరం గిరిజన పోస్టుల్లో గిరిజనేతరులను నియమించారని, వారిని సీనియర్లుగా చూపించి గిరిజన సిఆర్‌టిలకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటిడిఎలో మొదటి ప్రాధాన్యత గిరిజన యువతకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గుమ్మలక్ష్మీ పురం మండలం రేగిడి గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో జరిగిన అక్రమ డెప్యూటీ మేట్రిన్ నియామకం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పిఒను కలిసి వారిలో గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కమిటీ సభ్యులు కడ్రక చిన్నారావు, గిరిజన సిఆర్‌టిలు వెంకటరావు, వివేక్, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు బిటి రోడ్లు వేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఐటిడిఎ వద్ద ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

కురుపాం నియోజకవర్గంలోని పలు గిరి శిఖర గ్రామాలకు రహదారులు నిర్మించాలని కోరుతూ శుక్రవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు ఐటిడిఎ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తొలుంగూడ, భారామణి, వనకాబడి, సొల్డం గూడ, మాల్గాడి గూడ, వాడ జంగి తదితర గిరిజన గ్రామాలకు బిటి రోడ్లు వెంటనే వేయాలని గత రెండు రోజులుగా రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కడ్రక రామస్వామి, మండంగి అడ్డమేశ్వరరావు, మండంగి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాలను చిన్న చూపు చూస్తోందని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన తర్వాత డోలీ లేని గిరిజన గ్రామాలను నిర్మిస్తామని చెప్పి ఇప్పటికీ అనేక గిరిజన గ్రామాలకు బిటి రోడ్లు వేయలేదని చెప్పారు. వీటి వల్ల ఆరోగ్యం బాగా లేకపోతే గిరిజనులు డోలీలు కట్టి రోగులను కిందికి దించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. అలాగే గిరిజన విద్యార్థులు చదువుకోవడానికి, అటవీ ఉత్పత్తుల అమ్ముకోవడానికి కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. వెంటనే గిరిజన గ్రామాలకు బిటి రోడ్లు వేయాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు పిఒ స్పందిస్తూ నెల రోజుల్లో సర్వే చేసి పై గ్రామాలకు రోడ్డు కోసం అంచనాలు వేయిస్తామని,నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గిరిజనులు వెనుదిరిగారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.గంగునాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు కె.సాంబమూర్తి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, గిరిజన సంఘం నాయకులు పూలక వాసు, బిడ్డిక వెంకట్రావు, బిడ్డక భాస్కరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై ఉండే పోలీస్ సిబ్బంది శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే" (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ముఖ్య ప్రాధాన్యతను ఇస్తూ సిబ్బంది వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, వ్యక్తిగతమైన పలు సమస్యల పరిష్కారానికి జిల్లాలోని పోలీస్ సిబ్బంది పాల్గొని వారికి ఉన్న సమస్యలను ఎస్పీకి తెలిపారు. పోలీస్ సిబ్బంది విన్నవించుకున్న సమస్యలను ఎస్పీ కూలంకుషంగా విని, వినతులను పరిశీలించి సత్వర పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో సిసి సంతోష్ కుమార్ , సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీశ్వరి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సిఎం సహాయనిధి, రోడ్లు, తాగునీరు, ఇళ్ల స్థలాలు, పోడుపట్టాలు తదితర సమస్యలపై వినతులు అందించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్, మాజీ సమితి అధ్యక్షులు వెంపటాపు భారతి, నోంద్రుకోన సర్పంచ్ పత్తిక ముసురు, మాజీ ఎంపీపీ తాడంగి లక్ష్మణరావు, ఎంపిడిఒ లక్ష్మి, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రైడే పాటించేలా చైతన్యం కలిగించాలి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

డ్రైడే పాటించేలా ప్రజల్లో చైతన్యం కలిగించాలని డ్రైడే పాటించి జ్వరాలు, వ్యాధులు ప్రబలకుండా అదుపులో ఉంచవచ్చని జిల్లా వైద్య. ఆరోగ్య శాఖ అధికారి ఎస్.భాస్కరరావు సూచించారు. మండలంలోని ఉల్లిభద్రలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్నిశుక్రవారం ఆయన పరిశీలించారు. పాడైన వస్తువులు, రుబ్బురోల్లు, ప్లాస్టిక్ వస్తువులు తదితర వాటిలో నీటిని పరిశీలించి దోమల లార్వా గుర్తించిన వాటిని స్థానికులకు చూపించి, వాటి వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాల్వల్లో చెత్తా, చెదారం వేయరాదని అందువల్ల నీరు అక్కడ నిల్వ ఉండి, దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ తదితర వ్యాధులకు కారణమవుతాయని అన్నారు. డ్రైడే వివరాలు విసిహెచ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే గ్రామంలో స్కూల్‌లో ముస్తాబు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ తిరుమల ప్రసాద్ ప్రోగ్రాం ఆఫీసర్ కౌశిక్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రతి ఇంట, వీధుల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని భద్రగిరి సిడిపిఒ కె.విజయ గౌరీ కోరారు. గుమ్మలక్ష్మీపురంలో ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజారోగ్యంపై ప్రతి ఒక్కరు జాగ్రత్త పాటించాలని సూచించారు. వీధి కాలువలు, ఇంటి ముందు మురుగునీరు నిల్వ లేకుండా చూచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, అంగన్వాడీ సిబ్బంది ఉన్నారు.

సీతంపేట : మండలంలోని ధోనుబాయి సచివాలయంలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, తద్వారా దోమలను నివారించవచ్చునని తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి శివాజీ, సర్పంచ్ వెంకినాయుడు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గిరిజన పిజిఆర్‌ఎస్‌కు 26 వినతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 26 వినతులు అందినట్లు జాయింట్ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర హాలులో గిరిజన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కార్యక్రమం శుక్రవారం పిఒ సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ గిరిజనుల వ్యక్తిగత, సామాజిక, అభివృద్ధి సంబంధిత సమస్యలను నేరుగా సంబంధిత శాఖల అధికారుల సమక్షంలో ఉంచి పరిష్కారం పొందేలా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. కావున ఐటిడిఎ పరిధిలోని గిరిజనులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకొని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ పి.మురళీధర్, ఐటిడిఎ పరిధిలోని అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అరుణమ్మకు పలువురి నివాళి

ప్రజాశక్తి - మక్కువ

ఇటీవలే మరణించిన మావుడి అరుణమ్మ చిత్రపటానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. శుక్రవారం స్థానిక జడ్పిటిసిసభ్యులు మావుడి శ్రీనివాసరావు, మండల వైసిపి అధ్యక్షులు రంగునాయుడు స్వగృహం వద్ద శుక్రవారం జరిగిన పెద్దకర్మ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మావుడి సోదరులతో కలిసి తమ సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో సాలూరు నియోజక వర్గానికి చెందిన వైసిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

జానపద కళలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - సీతానగరం

సాంప్రదాయ జానపద కళలను ప్రోత్సహించాలని ఉపాధ్యాయులు కృష్ణదాస్ అన్నారు. మండలంలోని బొక్కుపేటలో గంట సాహెూ, బుడగ జంగంకార్ల ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరంలో జానపద కళలు కనుమరుగైపోతున్నాయని, ఈ తరుణంలో జానపద కళాకారులను ప్రోత్సహించేందుకు అందరూ ముందుకు రావాలని ఆయన కోరారు. వీరిని ప్రోత్సహించేందుకు కళాకారులు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గౌరీశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

సీతంపేట : మండలంలోని ధోనుబాయి పోలీస్ స్టేషన్ పరిధిలో గల కిల్లాడ జంక్షన్ వద్ద ఎస్ఐ షేక్ మస్తాన్ వాహనాలు తనిఖీలు శుక్రవారం చేపట్టారు. వాహనాలకు తప్పనిసరిగా ధ్రువపత్రాలు ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. హెల్మెంట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ, పోలీసులు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సిఆర్‌టిలకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఐటిడిఎ పరిధిలో గల పాఠశాలల్లో పనిచేస్తున్న గిరిజన ఉపాధ్యాయ సిఆర్‌టిలకు న్యాయం చేయాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రం అందజేశారు. మెగా డిఎస్సీ ద్వారా నియామకమైన ఉపాధ్యాయుల వల్ల ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న సిఆర్‌టి ఉపాధ్యాయుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని చెప్పారు. సిఆర్‌టిలను కొనసాగించాలని ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రస్తుతం ఉన్న సిఆర్‌టిలను యధావిధిగా కొనసాగించాలని గిరిజన సంఘాల నాయకులు పల్ల సురేష్, దుక్క సీతారాం, ఇంటికుప్పల రామకృష్ణ, ఆరిక చంద్రశేఖర్, రొబ్బ లవరాజు, మల్లయ్య కోరారు.

ఒంటరి మహిళ ఫిర్యాదుపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి కుమారుడు, పిఎ సతీష్‌చేత లైంగిక వేధింపులకు గురైన ఒంటరి మహిళ ఫిర్యాదుపై విచారణ జరిపించాలని న్యాయవాది రేగు మహేష్, రిపబ్లికన్ పార్టీ నాయకులు గొంప ప్రకాశరావు కోరారు. వారి వేధింపులపై ఒంటరి మహిళ ఫిర్యాదుపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహిళలకు రూ.1500 హామీ ఏమైనట్టు?

ప్రజాశక్తి - బలిజిపేట

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 19 నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని ఎన్నికల్లో ప్రకటించిన హామీ ఏమైందని సిపిఎం సీనియర్ నాయకులు గేదెల సత్యనారాయణ బొద్దాన భానుమూర్తి, వై.మన్మధరావు ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక ప్రజా సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 18 నెలలు గడిచినప్పటికీ ఈ మహిళల పథకం గూర్చి ప్రస్తావనే లేదన్నారు. రెండు జిల్లాల్లో మహిళలు సుమారుగా రూ.20 లక్షల వరకు ఉంటారని 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్యలో మహిళలు పెద్ద సంఖ్యలో ఉంటారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీపై పెద్ద చర్చ జరుగుతుందని, దీనిపై ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు.

కుష్టు నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - కురుపాం

కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి పిహెచ్‌సి పరిధిలో గల వైద్య సిబ్బందితో సర్వే చేపట్టి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా కుష్టు వ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్ అన్నారు. మండలంలోని నీలకంఠపురం పిహెచ్‌సి పరిధిలో గల తోలుముగూడ లో జరుగుతున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే బృందం గుర్తించిన అనుమానిత లక్షణాలు ఉన్న వ్యక్తులను వైద్య బందం ప్రత్యేకంగా తనిఖీ చేసి నమోదు చేస్తుందని, కుష్టు వ్యాధి ప్రాథమిక లక్షణాలు, వ్యాధి సోకడానికి గల కారణాలు, త్వరితగతిన గుర్తింపు అవసరంపై అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. కుష్టు వ్యాధి బారిన పడిన వారు భయ పడాల్సిన అవసరం లేదని, మల్టీ డ్రగ్ థెరపీ ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్య అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.